www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 అక్టోబర్ 2023
5
వైఎస్ఆర్

చెడుపై మంచి సాధించిన విజయం

ప్రజాశక్తి - కడప

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే.. విజయదశమి అని జిల్లా ప్రజలందరికీ విజయాలు చేకూర్చాలని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, జిల్లా ఇంఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు లతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పి చైర్మన్, నగర మేయర్, ఎస్పీ, జేసిలు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో సకాలంలో మంచి వర్షాలు కురిసి.. జిల్లాలో పంటలు సమృద్ధిగా పండాలని, అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని, అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.

ఒపిఎస్ అమలయ్యే వరకూ పోరాటం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్

ప్రజాశక్తి - బద్వేలు

ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సింది పోయి, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ చట్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం తగు మూల్యం చెల్లించక తప్పదని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ హెచ్చరించారు. జిపిఎస్ విధానాన్ని చట్టం చేస్తూ గెజిట్ విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న జగన్మోహన్ రెడ్డి సర్కార్ అందుకు భిన్నంగా అత్యంత దుర్మార్గపూరితమైన జిపిఎస్ విధానాన్ని తీసుకొనిరావడం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల గొంతు కోయడమేనన్నారు. మాట తప్పం, మడమ తిపం, విశ్వసనీయత కోల్పోతే అధికారంలో కొనసాగం అనే మాటలు వట్టి మాటలేనని తేలిపోయిందన్నారు. గ్యారెంటీ పెన్షన్ స్కీం పేరుతో గ్యారెంటీ లేని పెన్షన్ అమలు చేస్తూ, జిపిఎస్ విధానం దేశానికే ఆదర్శమని ప్రగల్భాలు పలకడం ఈ ప్రభుత్వానికే చెందిందన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల పట్ల శ్వేత పత్రాన్ని విడుదల చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో పాత పెన్షన్ విధానం రాజకీయ అజెండాగా మారబోతుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కక్ష సాధింపులకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.మహమ్మద్ గౌస్, ట్రెజరర్ ఎ.గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్షుడు వీరదాసరి క్రిస్టఫర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కె.సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాదన విజయకుమార్

గత డిఎ బకాయిల సంగతి తేల్చండి

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లించాల్సిన కరువు భత్యానికి సంబంధించిన బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు విమర్శించారు. ఆదివారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నంబర్ 133 ద్వారా 2022, జులై నుంచి 2023, అక్టోబర్ వరకు 16 నెలలు బకాయిలను విడతల వారిగా చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. నవంబర్ నుంచి జీతంతో కలిపి చెల్లిస్తాం అంటూ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. గతంలో కూడా 2022, జనవరి డిఎ కు సంబంధించి 18 నెలల బకాయిలు ఇంతవరకు ఒక్క పైసా కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించిన పాపాన పోలేదని తెలిపారు. ఇంకా రెండు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల పక్షపాత వైఖరితో వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉద్యోగులు కూడా ప్రభుత్వంలో భాగస్వాములేనన్న విషయం గుర్తెరిగి వారికి న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనారోగ్యం, అత్యవసరమైన కార్యక్రమాల కోసం అని ప్రభుత్వం వద్ద దాచుకున్న సొంత డబ్బులు చెల్లించడంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజిఎల్ఐ, సరెండర్ లీవు, మెడికల్ బిల్లు తదితర ఆర్థిక బకాయిల నన్నింటిని వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట దుర్మార్గపూరితమైన జిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తే ఆ దీక్షలను పోలీసులు చేత భగ్నం చేయించి ఏకపక్షంగా జిపిఎస్ కు గవర్నర్ ఆమోదం తో గెజిట్ విడుదల చేయడం ప్రభుత్వ నిరంకుశ విధానానికి పరాకాష్ట అని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇదే మొండి వైఖరితో ముందుకు వెళితే భవిష్యత్తులో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని, హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాలేదన్న సంగతిని ఈ ప్రభుత్వం మరువకూడదని తెలిపారు.ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో, ఎమ్మెల్సీలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని, లేని పక్షంలో భవిష్యత్తులో ఉధృతమైన పోరాట కార్యక్రమాల ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి. రమణ, నాయకులు దావుద్దీన్,కిరణ్ కుమార్, జావిద్,సుజిత్ పాల్గొన్నారు.

ముగిసిన విజిలెన్స్ దాడులు

- నాలుగు దుకాణాల్లో సోదాలు
- 400 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్న అధికారులు
- వెండి, నగదు సీజ్

బంగారాన్ని తరలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో ఐటి అధికారుల తనిఖీలు ఆదివారంతో ముగిశాయి. నాలుగు బంగారం దుకాణాల్లో బిల్లులు లేని సుమారు 400 కిలోల బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. బంగారంతోపాటు 350 కిలోల వెండి, రూ.2 కోట్ల నగదును ట్యాక్స్ లేనివిగా అధికారులు గుర్తించారు. విజయవాడ, తిరుపతికి చెందిన ఐటి అధికారులు నాలుగు రోజులుగా ప్రొద్దుటూరులోని బుశెట్టి జువెలర్స్, డైమండ్స్ దుకాణాలతోపాటు గురురాఘవేంద్ర, తల్లం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం భారీ ఎత్తున్న బంగారం సీజ్ చేశారు. సీజ్ చేసిన బంగారాన్ని అట్టపెట్టెలు, సూట్ కేసుల్లో భద్రపరిచి వాహనాల్లో తిరుపతికి తరలించారు. ఇతర ప్రాంతాల నుంచి బిల్లులు లేకుండా భారీ ఎత్తున బంగారాన్ని దిగుమతి చేసుకున్నట్లు ఐదిశాఖాధికారులు గుర్తించారు. వీటితోపాటు వజ్రాలు కూడా ఉన్నట్లు సమాచారం. పన్నులు కట్టాల్సిన డబ్బులు సుమారు రూ.170 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 40 మంది అధికారులు 14 కార్లల్లో వచ్చి సోదాలు చేశారు.

బంగారు వ్యాపారంలో ప్రొద్దుటూరు రెండో ముంబయిగా ఖ్యాతి గడించింది. దీంతో భారీగా అక్రమ బంగారం దిగుమతి అవుతోందన్న పక్కా సమాచారంతో అధికారులు నాలుగు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రొద్దుటూరులో దాదాపు రెండు వేలకు పైగా బంగారం, స్వర్ణకారుల దుకాణాలున్నాయి. ఐటి అధికారుల తనిఖీలతో మిగతా బంగారం వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. తనిఖీలు తమ వరకు వస్తాయన్న ఆందోళనతో బంగారం, స్వర్ణకారులు తమ దుకాణాలను మూసివేశారు. దసరా పండుగ సమయంలో బంగారు దుకాణాలన్నీ మూతపడడంతో కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు నిరాశ చెందారు.

8న విద్యా సంస్థల బంద్

విద్యార్థి, యువజన సంఘాల పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయొద్దని నవంబర్ 8న నిర్వహించబోయే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర, పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు, ఏఐఎస్బి రాష్ట్ర కన్వీనర్ జయవర్ధన్, పిడిఎస్ యు కడప కన్వీనర్ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటియుసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని దశబ్దానికి పైగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం శిలాఫలకాలకే పరిమితమయ్యాయని చెప్పారు. బ్రాహ్మణి ఉక్కు పరిశ్రమ పేరుతో భారీ పరిశ్రమకు శంకస్థాపన చేసిన ప్రభుత్వం, తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శంకుస్థాపనలు, నిర్మాణం పూర్తి చేస్తామని హామీలు మాత్రం ఇస్తూ వస్తున్నాయని చెప్పారు. చివరికి, తక్కువ సామర్థ్యంతో పరిశ్రమను పూర్తి చేసేందుకు ఇప్పటి ప్రభుత్వం శంకస్థాపన చేసిందన్నారు. డిగ్రీలు, ఇంజినీరింగ్, ఎంబిఏ, ఎంసిఏ చదువుకున్న యువత బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌కు వలస వెళుతున్నారని, ఇక్కడ నిర్మాణ దశలో ఆగిపోయిన గతంలోని భారీ పరిశ్రమనే పూర్తతే అభివృద్ధి శరవేగంగా సాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే నీళ్లులేక, వర్షాలు రాక కరువుతో ఉన్న ఈ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ వస్తే యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అందుకోసం విద్యార్థులు, యువకులు కలిసి నవంబర్ 8న జరిగే బంద్ ను జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయాల కోసం, కార్పొరేట్ వ్యక్తుల కోసం విశాఖ ఉక్కును బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని తిప్పి కొట్టేందుకు రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయని కోరారు. అనంతరం విద్యార్థి సంఘాలు తమ ఐక్యతను చాటారు. సమావేశంలో ఐఎఫ్ నగర కార్యదర్శి మైనుద్దీన్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివ శంకర్, ఉపాధ్యక్షులు తేజ, అశోక్, నిఖిల్ పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న నాయకులు

లలిత కళలకు విశిష్ట స్థానం కల్పించాలి

మాట్లాడుతున్న గొల్లపల్లి జయన్న

ప్రజాశక్తి - బద్వేలు

రాయలసీమ జానపద కళలు, లలిత కళలకు విశిష్ట స్థానం కల్పించాలని లలిత కళాభిరామ పింఛం కళా రత్న శిల్పకళాచార్య గొల్లపల్లి జయన్న తెలిపారు. ఆదివారం బద్వేల్ పట్టణంలోని స్థానిక ఎన్జీవో కార్యాలయంలో, తమ తల్లిదండ్రులైన గొల్లపల్లి రామయ్య పిచ్చమ్మల జ్ఞాపకార్థం, కళాకారుల ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాకారుల ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని , ఎం కె బి. ఎస్ .ఆర్, సాగర్ (జాతీయ ప్రధాన కార్యదర్శి) అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప , అన్నమయ్య జిల్లాల ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతు , వెంకటసుబ్బయ్య , ఆర్ వి సాయి కృష్ణ మున్సిపల్ వైస్ చైర్మన్ బద్వేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన సాంప్రదాయ కళలో భాగంగా, శిల్పకళా నైపుణ్యం ఎంతో ప్రాముఖ్యమైందని అన్నారు. దీని ద్వారా భారతీయ సంస్కృతిని ప్రపంచమంతా చాటి చెప్పే విధంగా శిల్ప కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు అన్నారు. శాస్త్రీయపరంగా, జానపదపరంగా పల్లెల్లో ప్రశాంతత కోసం, సాయంకాలం పూట భజన కోలాటాలు, హరి భజనలు పండరి భజనలు గ్రామాలు, ఇలా ఆయా ప్రాంతాల భాష విధానంలో ప్రజలు ఆనందపడుతూ కలలకు ప్రోత్సహిస్తున్నారని, ఈ నేపథ్యంలో బద్వేల్ పట్టణానికి చెందిన గొల్లపల్లి జయన్న తనకున్న శిల్పకళ నైపుణ్యంతో కళా రత్న అవార్డును తీసుకున్నారని చెప్పారు. జానపద చెక్క భజనలు కోలాటంలలో, కలసపాడు మండలంలోని హృదయపేట గ్రామానికి చెందిన సగిలి, భజన పుల్లయ్య కూడా కళా రత్న పురస్కారం తీసుకున్నారని, ఇలా ఎందరో కళాకారులు తమ తమ నైపుణ్యాలతో ప్రజలను ఆనందపరుస్తూ ఉంటారని తెలిపారు. అలాంటి వారిని అందరిని సత్కరించడం ఎంతో ఆనందదాయకమని ఆయన తెలిపారు.

పంచాయతీల స్వావలంబనకు ప్రాధాన్యత

స్వమిత్ర పథకంతో ప్రజల ఆస్తుల పరిరక్షణ
జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ముఖాముఖి..

పంచాయతీ ఆర్థిక పరిపుష్టికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎస్‌డబ్ల్యుపిసి నిధుల జమ మొదలుకుని 15 ఫైనాన్స్ నిధుల వినియోగం, సకాలంలో పన్నులను సేకరణపై దృష్టి సారించాం. ఫలితంగా జిల్లాలోని 557 పంచా యతీల్లో పారిశుధ్యం మొదలుకుని పచ్చదనం, పరిశుభ్రతను పెంపొం దించి ప్రజారోగ్యాన్ని పెంపొందిస్తాం. ఉపాధి హామీ నిధుల సహాయంతో పంచాయతీల్లోని గృహాలు మొదలుకుని రహదారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలను పెంచడంతో పచ్చదనాన్ని పరుస్తాం. దీంతోపాటు స్వమిత్ర పథకం కింద పంచాయతీల్లో ప్రజల స్థిరాస్తుల గణన ద్వారా శాశ్వత హక్కులు కల్పించే విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టడమైం దని పేర్కొంటున్న జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

పంచాయతీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

పంచాయతీలను బలోపేతంపై దృష్టి సారించాం. ఉపాధి హామీ సహాయంతో పంచాయతీల పరిధిలోని 2,246 గ్రామాల్లోని ఇళ్ల, రహ దారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం ద్వారా పచ్చ దనాన్ని పెంపొందించే ప్రయత్నం జరుగుతోంది. 15 ఫైనాన్స్ నిధుల విని యోగం ద్వారా పారిశుధ్యాన్ని పెంపొందిస్తాం. ఎస్‌డబ్ల్యుపిసి ప్లాంట్ల సహ యంతో సాలిడ్ వేస్ట్ వేనేజ్ వ్యవస్థ ద్వారా చెత్తా చెదారాన్ని సేకరించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాల్లో జమ చేయడం, వర్మీ కం పోస్టు ఎరువును తయారు చేసి సరసమైన ధరలకు రైతులకు విక్రయిస్తాం. తద్వారా భూ కాలుష్యాన్ని నియంత్రించే పంటలు వృద్ధి చెందే ప్రయత్నం జరుగుతోంది.

పంచాయతీ వివరాలు తెలపండి?

జిల్లాలో 557 పంచాయతీలున్నాయి. ఇందులో వేంపల్లి, నందిమండలం, చెన్నూరు, ఖాజీపేట, కొత్తపల్లి, గోపవరం, పోరుమామిళ్ల, రంగసముద్రం మేజర్ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా పంచాయతీల పరిధిలో 2,246 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలోని పంచాయతీల నిర్వ హణను 427 మంది కార్యదర్శులు పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తు న్నారు.

జగనన్న స్వచ్ఛసంకల్పాన్ని వివరించండి?

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా డైలీ క్లాప్ మిత్రలు ఇంటింటికీ తిరిగి తడిపొడి చెత్తలను వేరు చేసి పొడిచెత్తలోని గాజుముక్కలు, ప్లాస్టిక్‌వ్యర్థాలను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూపంలో సంపదను సృష్టించే ప్రయత్నం జరుగుతోంది. ఎస్‌డబ్ల్యూపీసీ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల ఖాతాల్లో జమచేస్తాం. కొన్ని మేజర్ పంచాయతీల్లో వచ్చే అధిక ఆదాయాన్ని డైలీ క్లాప్‌మిత్రలకు వేతన రూపంలో సర్దుబాటు చేయడానికి అవకాశం ఉంటోంది.

ఎల్‌డబ్ల్యుఎం కార్యకలాపాల గురించి చెప్పండి?

లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎల్‌డబ్ల్యుఎం)లో భాగంగా పంచాయతీల్లోని నీటి వృథాను అరికట్టడం, డ్రెయినేజీ క్లీనింగ్, డ్రెయి నేజీ బ్లాకింగ్, వాటర్ స్టాగ్నేషన్ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయడం ద్వారా దోమల వ్యాప్తిని నిరోధించడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

పారిశుధ్య నిర్వహణ చర్యలేమిటి?

జిల్లాలోని 557 పంచాయతీల పరిధిలోని 2,246 గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు 626 పారిశుధ్య నిర్వహణ కేంద్రాలున్నాయి. ఇందులో 525 పారిశుధ్య కేంద్రాల్లో 1301 క్లాప్‌మిత్రలు, 1304 ట్రైసై కిళ్ల సహాయంతో పారిశుధ్య చర్యలు చేపట్టడం జరిగింది.

ఓడిఎఫ్ ప్లస్ అంటే ఏమిటి?

ఓడిఎఫ్ ప్లస్ అంటే ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ అని అర్థం. జిల్లాలోని 557 పంచాయతీల వారీగా అమలుకు గట్టి కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా మలవిసర్జన నివారణకు కృషి జరుగుతోంది. తక్కువ సమయంలో ఇటువంటి వ్యర్థాల నివారణపై అవగాహన కల్పించే కృషి ఊపందుకుంది.

స్వమిత్ర పథకం తీరుతెన్నుల గురించి తెలపండి?

స్వమిత్ర పథకం కింద పంచాయతీల పరిధిలోని ఆయా రెవెన్యూ గ్రామాల ప్రజలకు సంబంధించిన స్థిరాస్తుల వాణిజ్యీకరణ ఊపందుకుంది. సంబధిత పథకం కింద ఆయా గ్రామాల్లో డ్రోన్ సర్వే ద్వారా ప్రజల ఆస్తులను గణిస్తారు. అనంతరం సంబంధిత ఆస్తులకు మార్కెట్ విలువను జోడించడం జరుగుతుంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం, ప్రజల ఆస్తులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పన ద్వారా భద్రత కల్పించడం జరుగుతుంది.

స్వమిత్ర పథకం సర్వే ఎలా సాగుతోంది?

జిల్లాలోని 731 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 625 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే చేపట్టనున్నాం. ఇందులోభాగంగా 188 గ్రామాల్లో మ్యాపు-1 పిపిఎంఎస్‌ను తీయడమైంది. ఇందులో 110 ఇళ్లు, ఇళ్ల స్థలాలను గుర్తించడమైంది. ఇందులో 147 మ్యాప్-2 పిపి ఎంఎస్ తీయడమైంది. ఇందులో 93 భూ ఆధారిత గుర్తింపు ప్రక్రి యల్ని పూర్తి చేయడమైంది. 17 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే ద్వారా పూర్తి స్థాయి సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో72గ్రామాల్లో ఆస్తుల డ్రా ఫ్ట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడమైంది.

అష్ఫాకుల్లాఖాన్ స్ఫూర్తితో బిజెపి విధానాలను ఎండగడదాం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

అష్ఫాకుల్లాఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్వాతంత్ర్య సమర యోధుడు, యువత ఆశాకిరణం అష్ఫాకుల్లా ఖాన్ స్ఫూర్తితో బిజెపి మతోన్మాద విధానాలను ఎండగడదాం, విభజన హామీల కోసం ఉద్యమిద్దాం అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ తెలిపారు. ఆదివారం అష్ఫాకుల్లా ఖాన్ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ అధ్వర్యంలో కడపలో పాత బస్టాండ్ జిల్లా కార్యాలయ లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అష్ఫాకుల్లా ఖాన్ పాత్ర కీలకమైనది అన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం 27 సంవత్సరాల వయస్సులో ప్రాణాలను అర్పించారు ధీరుడు అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మత సామరస్యం పాటించి మతోన్మాదాన్ని వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిఆపరు. నేడు బిజెపి ప్రభుత్వం త్యాగధనులను మరచింది అన్నారు. కులాలు, మతాల పేరుతో దాడులకు పాల్పడుతున్నారు అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని వాపోయారు. ప్రధానంగా విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చట్టబద్ధంగా రాసుకున్నా పరిశ్రమ ఏర్పాటు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని నిలదియకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వాపోయారు. కేవలం ఎన్నికల స్టంట్ లాగా కడప ఉక్కు పరిశ్రమను ఉపయోగించుకుంటున్నారు అన్నారు. కడప ఉక్కు సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షాకీర్,ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్వాహకులకు ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్టు సభ్యులు

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని దౌలాతాపురం ఎస్‌టి కాలనీ సమీపంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ కక్కయ్య స్వామివారి ఆలయ నిర్మాణానికి పుణ్యభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్య సాయి నాథ శర్మ రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన శిష్యులు పెద్ద బుద్ధి వెంకట శివప్రసాద్, జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా నాయకుడిగా మానవతావాదిగా మానవత హృదయం కలిగిన సత్య సాయి నాథ శర్మ అని వారు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సంతోష్ ,ప్రసాద్, రాజారెడ్డి పాల్గొన్నారు.

'మానవత' కంటే విలువైనది ఏదీ లేదు

కడప అర్బన్ : మానవత కంటే విలువైనది ఏదీ లేదని మానవతా నగర అధ్యక్షులు సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ, చదువులో ఉత్తమంగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా అవార్డులు, నగదు పారితోషికం, ఆపదలో ఉన్నవారికి రక్తదాన శిబిరాల ద్వారా రక్త అందించడం ద్వారా ప్రజలకు మానవతా సంస్థ చేరువైతుందని చెప్పారు. మానవతా కార్యాచరణను కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ ప్రశంసించారని తెలిపారు. నగరంలోని హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించేందుకు మానవతకు అప్పగించారని పేర్కొన్నారు. మొత్తం ఎనిమిది ఎకరాలు కేటాయించారని, మేడా రఘునాథరెడ్డి రూ.7 కోట్లు ఇచ్చారన్నారు. సమావేశంలో నగర కోశాధికారి వీరారెడ్డి, నాగార్జున కళాశాల అధినేత రామకృష్ణారెడ్డి, శివ విష్ణు మోహన్ రెడ్డి, శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

1న ప్రజా రక్షణభేరి సభ

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్ రాక

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజా రక్షణభేరి సభ నవంబర్ ఒకటో తేదీన కడపలో నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర నవంబర్ ఒకటో తేదీన కడపకు రానున్నట్లు తెలిపారు. లౌకికవాదం ప్రజాస్వామ్య ప్రదక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్రను నిర్వహిస్తున్నదని వారన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే తీవ్ర ఆవేదనకు గురికావాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఒకవైపు రాష్ట్రాల హక్కుల్ని హరిస్తూ, మరో వైపు విద్య, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు కావస్తున్నా ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ లాంటి విభజన హామీలు ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కు పరిశ్రమను తెగనమ్మడానికి తయారైందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవడానికి, మన హక్కులను నిలుపుకోవడానికి సిపిఎం ప్రజా రక్షణ భేరి మోగిస్తోందని, విజయవంతానికి అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగా ఉదయం 11 గంటలకు కడప పాత బస్టాండ్ లో జరిగే సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సభకు ప్రధాన ఉపన్యాసకులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి. కృష్ణయ్య, కె.ఉమామహేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్,రాష్ట్ర నాయకులు దయా రమాదేవి, నల్లప్ప, జిల్లా నాయకులు మనోహర్, సుబ్బమ్మ, దస్తగిరిరెడ్డి , కామానురు శ్రీనివాసులరెడ్డి హాజరవుతారన్నారు. ప్రజానీకం ప్రజారక్షణ భేరి సభ లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగ యువత ఉద్యమించాలి

బద్వేలు : నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని దీని కోసం నిరుద్యోగ యువతీ యువకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పిలుపునిచ్చారు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చదువుకున్నటువంటి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లాలో అనేక వనరులున్నప్పటికీ వాటి ఆధారంగా కొన్ని పరిశ్రమలు నెలకొల్పడంలో అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో చదువుకున్నటువంటి అనేకమంది యువతీ యువకులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇతర దేశాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది యువతీ యువకులు ఉద్యోగాలు రాక ఈ మధ్యకాలంలో ఆత్మహత్యలు చేసుకున్నారని వారు తెలిపారు. జిల్లాలో విపరీతంగా ఎర్రచందనం, వెదురు, బంక మట్టి అనేక వనరులు ఉన్నప్పటికీ వాటి ఆధారంగా పరిశ్రమలు స్థాపించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఒత్తిడి తీసుకురావాలని, లేనిపక్షంలో నిరుద్యోగ యువతీ యువకులు రాబోయే ఎలక్షన్లలో తగిన గుణపాఠం చెబుతారని వారు తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, మహిళా కన్వీనర్ సి గురుదేవి, పట్టణ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి బాల గురవయ్య, ట్రెజరర్ పాల్గొన్నారు.

చెన్నూరు ఎస్ఐగా చిన్న పెద్దయ్య

చెన్నూరు : సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చిన్నపెద్దయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

నగదు అందిస్తున్న చల్లా రాజగోపాల్ దంపతులు

మానవత్వం చాటుకున్న 'చల్లా' దంపతులు

- వివాహానికి రూ.50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిరుపేద కుటుంబ వివాహానికి చల్లా రాజగోపాల్ యాదవ్ దంపతులు రూ.50 వేలు ఆర్థికసాయం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రొద్దుటూరు కృష్ణాలయ కమిటీ చైర్మన్, కడప జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ నిరుపేదలైన సుకూర్, వహీదా కుమార్తె షాహిన్ వివాహానికి రూ.50 వేల ఆర్థికసాయం చేసి మరోమారు దాతృత్వం చాటుకున్నారు. ఎంతోమంది విద్యార్థులకు, ప్రతినిత్యం అన్నదానం, పలు వివాహాలకు అన్నదానం, ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నారు. షాహిన్ వివాహ సమయానికి ఒక జత కమ్మలు అమ్మాయికి అందజేస్తామన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పలువురు చల్లా రాజగోపాల్ యాదవ్‌ను అభినందించారు.

ఎస్‌పిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సభ ప్రతినిధులు

అమ్మవారిని దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి - చాపాడు

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహిషాసుర మర్ధిని అలంకారంలో అమ్మవారిని ఎస్‌పి సిద్ధార్థ కౌశల్, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర వేర్వేరుగా దర్శించుకున్నారు. మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు సూరిశెట్టి శివవెంకటప్రసాద్ గుప్తా ఆధ్వర్యంలో వీరికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శనం చేయించి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యలవలి హరికిషన్, దొంతు వెంకటసుబ్బయ్య, దరిశా వరహాలు సునీల్, ఎలిశెట్టి వెంకట గురుప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అల్లాడుపల్లెలో శమీ దర్శనం

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం మొదటిసారిగా దసరా సందర్భంగా శ్రీ శమీ వృక్ష స్వరూప అపరాజిత దేవి మహాలక్ష్మి పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమలో భక్తులు పాల్గొని మహామంగళ హారతి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

మహిషాసుర మర్ధిని అలంకారంలో అమ్మవారు

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో, పార్నపల్లె రోడ్డులోని అంకాలమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహిషాసుర మర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రేపు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పులివెందుల ఆర్‌టిసి ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ గోవర్ధనరెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఆదివారం డిపో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు ప్రయాణికుల ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు తమ అమూల్యమైన సూచనలు, విన్నపాలు, ఫిర్యాదులు తెలపవచ్చున్నారు. కార్యక్రమంలో 99592 25780కు ఫోన్ చేయాలన్నారు.

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

దసరా పండుగరోజు భక్తులు, ప్రజల సౌకర్యార్థం ప్రొద్దుటూరులో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఎఎస్‌పి ప్రేరణకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు దసరా రోజు శమీదర్శన ఉత్సవం సందర్భంగా ట్రాఫిక్ మళ్లించామన్నారు. అమ్మవారిశాల నుండి దర్గా బజార్, లైట్‌పాలెం, శివాలయం, రాజీవ్‌సర్కిల్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా కొర్రపాడు రోడ్డులోని పెద్దమ్మచెట్టు వరకు భక్తుల రద్దీ వల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. పట్టణంలోని బస్టాండు నుండి గాంధీరోడ్డు వైపునకు గాంధీరోడ్డు, వైయంఆర్ కాలనీ నుండి బస్టాండ్ వైపు వెళ్లేవారు రింగ్‌రోడ్డు మీదుగా రాకపోకాలు సాగించాలన్నారు. హోమస్‌పేటలో సెంట్రల్ పార్కింగ్ చేయకూడదన్నారు. లారీ వంటి పెద్దవాహనాల ఆంక్షలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

వాహనాల తనిఖీ : ఎఎస్‌పి ప్రేరణకుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 10గంటల నుండి అర్ధరాత్రి 12 వరకు పోలీసులు పట్టణంలోని పలు కూడళ్లలో వాహనాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై, అతివేగంగా నడిపేవారిపై, అజాగ్రత్త.. నిర్లక్ష్యంగా నడిపేవారిపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవి సర్కిల్ వద్ద నిబంధనలు ఉల్లఘించిన వారి వాహనాలను జప్తు చేశారు.

క్రైం కార్నర్

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ

అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న వల్లూరు మండలం కోట్లూరు గ్రామానికి చెందిన కొత్తపల్లి మదార్‌వలి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ అతని వద్ద నుంచి 19 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

12 మంది పేకాట రాయుళ్లు ..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేకాట ఆడుతున్న 12మందిని అరెస్టు చేసి వారివద్ద నుండి రూ.49,500 స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సిఐ ఇబ్రహీం ఆదివారం రాత్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు డిసిఎస్ఆర్ కాలనీలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

విలు విద్యలో ఎపి నెంబర్ వన్ కావడమే లక్ష్యం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ

ప్రజాశక్తి - వేంపల్లె

విలు విద్యలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో రావడమే లక్ష్యంగా చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ విద్యార్థులను తీర్చి దిద్దుతున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరు సత్యనారాయణ చెప్పారు. ఆదివారం వేంపల్లెలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్ చాంపియన్ షిప్ పోటీలను వేంపల్లెలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏషియన్ గేమ్ ప్రారంభం అయిన తొలి సారిగా భారత జట్టు రిక్వర్ పురుషుల విభాగంలో ఫైనల్‌కు చేరిందని చెప్పారు. వంద సంవత్సరాల ఒలింపిక్స్‌లో కొరియాకు విలు విద్యలో ఎవరూ సాటి రాలేక పోయారని, అయితే చెరుకూరి ఓల్గా అర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ 2022 ఆసియా క్రీడల్లో తన ప్రతిభను చూపించి, భారత దేశానికి రజత పతకం అందించినట్లు చెప్పారు. 22 సంవత్సరాల బొమ్మదేవర ధీరాజ్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భారతీయ ఆర్చర్ అన్నారు. చిన్న వయసు నుండే ఆర్చరీలో ధీరజ్ శిక్షణ పొందినట్లు చెప్పారు. విజయవాడలోని వోల్గా ఆర్చరీలో శిక్షణ పొందిన ధీరాజ్ రికర్వ్ పురుషుల వ్యక్తిగత మరియు జట్టు ఈవెంట్లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించినట్లు చెప్పారు. రికర్వ్ పురుషులలో ధీరజ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 4వ స్థానంలో ఉన్న ధీరజ్ 2024లో ప్యారిస్‌లో జరిగే ఆర్చరీలో అర్హత సాధించడం కోసం కఠినమైన శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ తెలుగు వారి సత్తా చూపించేందుకు విద్యార్థులకు నైపుణ్యంగల శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 2024గానీ 2028గానీ జరిగే ఒలింపిక్స్‌లో ఖచ్చితంగా ఆంధ్ర బాలురు, బాలికలు మెడల్ సాధించి దేశానికి గౌరవ ప్రతిష్టలు తెచ్చేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలికలు కాంపౌండ్ విభాగంలో నెంబర్ వన్ స్థానంలో ఉండగా, పురుషులు రికర్వ్ విభాగంలో 4వ స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రస్థాయి విలు విద్య పోటీలను వేంపల్లెలో చేపట్టినట్లు చెప్పారు. ఆర్చరీ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యుడు జనార్ధన్‌రెడ్డి ఆర్చరీ క్రీడాకారులకు, కోచ్‌లకు అన్ని రకాలుగా వసతి, భోజన సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఆర్చరీ శిక్షణ కఠినమైనప్పటికీ విద్యార్థులు ఆర్చరీ క్రీడపై మొగ్గ చూపుతున్నారని వివరించారు. రాష్ట్రంలో టాలెంట్ ఉన్న విద్యార్థులను గుర్తించి శిక్షణ ఇచ్చి భారతదేశం తరపున జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ జట్టు ఏషియన్ గ్రేమ్, ప్రపంచ చాంపియన్ షిప్‌లకు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీలు లేకుండా బయటికి వెళ్లడం లేదన్నారు. వేంపల్లెలో జరిగే పోటీల ద్వారా నవంబర్‌లో రాజస్థాన్, అయోధ్యలో సీనియర్, జూనియర్ జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాజస్థాన్, అయోధ్య పోటీల్లో పాల్గొన్న నైపుణ్యం గల బాలురు, బాలికలు, పురుషులు, మహిళలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలబడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓల్గా ఆర్చరీలో శిక్షణ పొందుతున్న ఆర్చరీలు వారి విభాగాల్లో ప్రతిభ చూపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 25 నుంచి గోవాలో పోటీలు జరుగుతున్నాయి. ఇందులో కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్చరీలు హాజరవుతున్నట్లు చెప్పారు. గతంలో ఎక్కువ మెడల్స్ సాధించామన్నారు. అలాగే ఈసారి కూడా ఆంధ్ర ప్రదేశ్ జట్టు మెడల్స్ సాధిస్తుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. గోవాలో ఆడే విద్యార్థులు వేంపల్లెలో జరిగే పోటీలకు హాజరయ్యారని తెలిపారు. ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా ఆర్చరీ అసోసియేషన్ భాగమే అన్నారు. కడప జిల్లాలో విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో బాగా రాణిస్తున్నారని చెప్పారు. ఆర్చరీలో రాణిస్తున్న ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కూడా పొందినట్లు తెలిపారు. అలాగే స్పోర్ట్స్ కోటాలో మెడిసిన్, ఇంజనీరింగ్ సీట్లు పొందుతున్నట్లు చెప్పారు. ఆర్చరీ బాగా ఖర్చుతో కూడుకున్న క్రీడ, అయినప్పటికీ విద్యార్థులు దీని పట్ల మక్కువ చూపుతున్నారని అన్నారు. బాలికలు, బాలురు సమానంగా క్రీడాల్లో రాణిస్తున్నారని సత్యనారాయణ పేర్కొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో వాతలు, కోతలే : పిసిసి

పజాశక్తి - వేంపల్లె

ఎన్.తులసిరెడ్డి

వైసిపి ప్రభుత్వంలో వాతలు, కోతలేనని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక వైపు కరెంటు కోతలతో.. మరో వైపు పెరిగిన కరెంటు ఛార్జీల వాతలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. జగన్ పాలనలో కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయన్నారు. 2019 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచకుండా ఇంకా తగ్గిస్తామని జగన్ ప్రచారం చేశారని తెలిపారు. జగన్ మాటలను విని ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పి బాదుడు కార్యక్రమాన్ని మొదలు పెట్టారని విమర్శించారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో 8 సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని చెప్పారు. అదనపు భారం కింద దాదాపు రూ.50 వేల కోట్లు ప్రజలపై వేశారన్నారు. అసలు కంటే కొసరు ఎక్కువైనట్లు స్థిర ఛార్జీలు, కస్టమర్ సర్వీస్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం ఇలా రకరకాల పేర్లతో పెంచారన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగింపు పేరుతో రూ.13000 కోట్లు, వ్యవసాయ పంపు సెంట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు పేర్లతో రూ6888 కోట్లు అదనపు భారం మోపేందుకు వైసిపి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో విద్యుత్ వినియోగదారులు వైసిపిని చిత్తు చిత్తుగా ఓడించి రివర్స్ షాక్ ఇస్తారని తులసిరెడ్డి పేర్కొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రూరల్ పరిధిలోని శేగిరెడ్డి కాట్రెడ్డి కళ్యాణ మండపంలో సామాజిక సాధికారత బస్సు యాత్రకు సంబంధించి కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో రాష్ట్రంలో సామాజిక సాధికారత పేర్లకే పరిమితమైందని, జగన్ సీఎం అయ్యాకే ఆచరణలోకి వచ్చిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను రాజ్యాధికారంలో భాగస్వామ్యాలను చేశారని వివరించారు. క్షేత్రస్థాయిలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాయని పేర్కొన్నారు జగన్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరుగుతున్న సంక్షేమం గురించి వారందరికీ తెలిసేలా ఈ బస్సు యాత్రలో వైసిపి నాయకులు సూచించారు. సామాజిక సాధికారత బస్సుయాత్ర తొలి విడత కడప జిల్లాలో ప్రొద్దుటూరు పట్టణంలో జరగడం ముఖ్యమంత్రి నిర్ణయమని, దీన్ని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ యాత్ర రైల్వేస్టేషన్ రోడ్డులోని వైవి రామ్మోహన్‌రెడ్డి ఫంక్షన్ హాల్ నుండి ప్రారంభించి రామేశ్వరం రోడ్డు, వన్‌టౌన్ సర్కిల్, గాంధీరోడ్డు, విజయ్‌కుమార్ సర్కిల్, టిబి రోడ్డు, రాజీవ్ సర్కిల్, శివాలయం రోడ్డు మీదుగా శివాలయం సర్కిల్ వరకు నిర్వహించి అక్కడ సభ ఏర్పాటు చేశారు. ఎం పీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ బీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ లు రంగారెడ్డి, సిఎస్ ఖాజా మొయిద్దీన్, అప్కబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింక విజయలక్ష్మి, వైసిపి రాష్ట్ర అదనపు కార్య దర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసిఎ జిల్లా కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైసిపి మహిళా పట్టణ అధ్యక్షురాలు కోనేటి సునంద, పట్టణ అధ్యక్షులు కామి శెట్టిబాబు, సర్పంచులు, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అన్నీ సమస్యలే : టిడిపి

కరపత్రాలతో భూపేష్‌రెడ్డి, నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పేదలను సంపన్నులను చేయడమే టిడిపి లక్ష్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ప్రకాష్‌నగర్‌లో ఆదివారం బాబుతో నేను, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరంలలో 8 సార్లు కరెంట్ బిల్లులు, 4సార్లు బస్సు ఛార్జీలు పెంచిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పన్నులు పెంచుకుంటూ నిత్యావసర ధరలు పెంచి పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులు గురిచేస్తోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మభ్యపెడుతున్నారన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తను ఎమ్మెల్యేగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండలం ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పార్టీ నాయకులు బయపురెడ్డి, నాగేశ్వరరావు, సేట్, శివారెడ్డి, సంజీవరెడ్డి, టైలర్ మాబు, బాషా, కొండన్న, ప్రభుదానం, ప్రసాద్, నాగ, రమేష్, సురేష్, సునంద్, గంగన్న, గంగరాజు, మోహన్, జాకోబ్, ఏలియా, వెంకట్రాముడు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరు అందేనా..!

చాపాడులోని పంట కాలువలో ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు చానల్ పరిధిలోని కెసి కాలువ చివరి ఆయకట్టుకు నీరు అందేనా అని రైతుల్లో ఆందోళన నెలకొంది. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా సిమెంట్ లైనింగ్ కాలువలు ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ పరిధిలో ఖాదర్‌పల్లె, చాపాడు, సీతారామపురం, రాజువారిపేట, తిమ్మాయపల్లె, నక్కలదిన్నె గ్రామాల పరిధిలో వందల ఎకరాల్లో సాగు పొలం ఉంది. కాలువకు నీరు రాకపోవడంతో రైతులు ఇతర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఖాదర్‌పల్లి, చాపాడు గ్రామాల్లో ఉన్న కెసి కెనాల్ కాలువలో గృహ అవసరాలకు వినియోగించిన డ్రయినేజీ నీరు అనుసంధానం చేయడం వలన కాలువ పూర్తిగా వ్యర్థ పదార్థాలతో నిండి ఉంది. దీంతో కెసి నీరు కాలువలో ప్రవహించే అవకాశం లేదు. ప్రస్తుతం చాపాడు కెసి కాలువకు తాత్కాలికంగా నీరు విడుదల చేసినా, చివరి ఆయకట్టుకు సాగునీరు రావడం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. డ్రయినేజీని తొలగించి కాలువలో పూడికతీత పనులు చేపడితే సాగు నీరు ప్రవహించే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కెసి కాలువకు లైనింగ్ ఏర్పాటు చేసినా కాలువ పూర్తిగా గ్రామం మధ్యలో ఉంది. డ్రయినేజీ కాలువలో పూడికతీత పనులకు ఉపాధి కూలీలు వచ్చేందుకు అయిష్టత చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో పూడికతీత పనులు కూడా చేపట్ట లేదు. పంచాయతీ సిబ్బంది గృహ అవసరాలకు వినియోగించిన నీటిని కాలువలోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మురుగు నీరు కాలువలోకి రాకుండా చూసి, అనంతరం పూడికతీత చేపడితే పంట కాలువ ఉపయోగంలోకి వస్తుంది. లేదంటే ఈ పంట కాలువ పూర్తిగా డ్రయినేజీ కాలువగా మారే ప్రమాదం ఉంది. రాజువారిపేట వద్ద వరి పంటకు నీరు అందక ఎండి దశకు చేరుకుంటోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, చివరి ఆయకట్టుకు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రాజువారిపేట వద్ద నీరందక ఎండుతున్న వరి పంట

అధికారులు సినిమా హాళ్లను తనిఖీ చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవిడ్‌రాజ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దేవిడ్‌రాజ్

సినిమా హాళ్లను అధికారులు తనిఖీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవిడ్ రాజ్ డిమాండ్ చేశారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికంగా సినిమా థియేటర్లలో పార్కింగ్ ఫీజు వసూలు ఆపాలన్నారు. సినిమా థియేటర్ లోపల తినుబండారాల పేరుతో అధిక రేట్లకు అమ్ముతున్నా చోద్యం చూస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన హీరోలా సినిమాల విడుదల సందర్భంగా అధిక రేట్లకు టిక్కెట్లు అమ్ముతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా థియేటర్స్‌కి వచ్చే ప్రేక్షకులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. వెంటనే ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సినిమా థియేటర్స్ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. డివైఎఫ్ఐ నాయకులు శ్రీహరి, శివ పాల్గొన్నారు.

మంచినీటి పథకం పైపులైన్లకు చేస్తున్న మరమ్మతులు

కె.రాజుపల్లె మంచినీటి పథకానికి మహర్దశ..!

ప్రజాశక్తి - చక్రాయపేట

కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్‌రెడ్డి చొరవతో కె.రాజుపల్లె గ్రామంలోని మంచి నీటి పథకానికి మహర్దశ వచ్చింది. కొంతకాలంగా పైప్‌లైన్ లీకేజీలతోపాటు కొన్ని సాంకేతిక కారణాల వల్ల నీటి పథకం పనిచేయలేదు. సమస్యను ఇటీవల ఎంఎ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సంబంధిత శాఖ అధికారులతోపాటు కాంట్రాక్టర్ మూలపల్లె రంగారెడ్డిని పిలిచి సత్వరం పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ మేరకు పనులు ప్రారంబించారు. మండలంలోని సగం గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఈ నీటి పథకాన్ని మంజూరు చేశారు. సదరు నీటి పథకం నేడు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. సమస్య విన్న వెంటనే నీటి పథకానికి మరమ్మతులు చేయించి ప్రజలకు నీరు అందేలా చేసేందుకు కృషి చేసిన ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డికి చక్రాయపేట మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలకు నీటిని సరఫరా చేయడం ఆనందదాయకం.. అభినందనీయం.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రకృతి వ్యవ సాయం ద్వారా మంచి దిగుబడి వస్తుందని అధి. కారి ప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చిలేకంపల్లి, గంగారపు వాండ్లపల్లిలో రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సంభోది బృందం నవీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కంచెలేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఏదైనా ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా.. ముందుగా మేలుకోరా అని పలువురు విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని గూడెంచెర్వు గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. దాని పక్కనే నివాసాలు ఉన్నాయి. ఒక వైపు రోడ్డు, మరోవైపు ప్రజల ఇళ్లు ఉండడమే కాక నిత్యం వాహనాలు తిరుగుతున్న ప్రదేశం కావడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేస్తే ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆపవచ్చని స్థానికులు సూచిస్తున్నారు. పశువులు వంటి మూగ జీవాలు అటువైపు వెళుతుంటాయని, అంతేకాక చిన్నపిల్లలు పొరపాటున అటు వెళితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని హడలిపోతున్నారు.ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పట్టణంలోని శిల్పారామంలో చిన్నారుల నత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.రాజ కళా నిలయం వారు నిర్వహించిన శిల్పారంలో చిన్నారులు చేసిన నత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దసరా పండుగ సెలవులు కావడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ , డ్యాన్స్ మాస్టర్ రాజ పాల్గొన్నారు.

నత్యాలు చేస్తున్న చిన్నారులు